# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-08-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఢిల్లీలో ఈరోజు బైక్ ర్యాలీని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ప్రారంభించారు.**
2. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యా, నైపుణ్యాభివృద్ధిశాఖలతో పాటు పలు అంశాలపై ఈరోజు సమీక్ష నిర్వహిస్తున్నారు.**
3. **సాధ్యమైనంత తర్వలో తుంగభద్ర జలాశయానికి స్టాప్‌లాగ్ గేటు ఏర్పాటు చేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**
4. **ఉపాధ్యాయుల పని సర్దుబాటుపై రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్‌ను పొడిగించింది.**
5. **భారతదేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన తొలితరం సమరయోధుల్లో గాదె చిన్నపరెడ్డి వర్ధంతి ఈరోజు.**

==========================

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఢిల్లీలోని భారత్ మండపం నుంచి తిరంగా బైక్ ర్యాలీని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో హర్ ఘర్ తిరంగా ర్యాలీలో అనపర్తి శాసన సభ్యులు ఎన్. రామాకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో నిర్వహించిన తిరంగా ర్యాలీలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, శ్రీకాళహస్తి శాసన సభ్యులు బి. సుధీర్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహోన్నత చరిత కలిగిన మువ్వన్నెల జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని కోరారు.

స్వాతంత్రోద్యమ స్ఫూర్తి ప్రతి ఒక్కరిలో పెంపొందించేందుకు హర్ ఘర్ తిరంగా నిర్వహిస్తున్నట్లు చిత్తూరుజిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా చిత్తూరులో నిర్వహించిన బిగ్ రన్ ను కలెక్టర్ ప్రారంభించారు.

-----------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పలు శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్నారు. విద్యా శాఖ, నైపుణ్యాభివృద్ధిశాఖలపై నిర్వహిస్తున్న సమీక్షలో సీబీఎస్ఈ పాఠశాలల పని తీరు, విద్యా విధానంలో తీసుకు రావాల్సిన మార్పులు, నైపుణ్య గణన అమలుపై చర్చిస్తున్నారు. అలాగే పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించనున్నారు. పర్యాటకం ద్వారా సేవల రంగాన్ని మరింత విస్తృత పరిచే అంశంతో పాటు, ఎకో, బీచ్, ఆధ్యాత్మిక పర్యాటక అంశాలపై సమీక్ష నిర్వహించనున్నారు. ఇలా ఉండగా అమరావతిలో పర్యటిస్తున్న ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో నిన్న సమావేశమైంది. రాజధాని అమరావతి నిర్మాణంపై ఈ సమావేశంలో చర్చించారు. అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా నిర్మించనున్నామని ముఖ్యమంత్రి ప్రపంచ బ్యాంకు ప్రతినిధులకు వివరించారు. ఉత్తమ ప్రమాణాలు, సాంకేతికతతో రాజధాని నగర నిర్మాణం చేపట్టామని తెలిపారు.

-------------------------

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ రోజు తిరుపతి జిల్లా శ్రీహరి కోటలో పర్యటిస్తున్నారు. శ్రీహరి కోటలోని సతీష్ ధావన్ భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం షార్ కేంద్రంలో నిర్వహిస్తున్న జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ – ఇస్రో ఆధ్వర్యంలో గత నెల 14 నుంచి ఈ నెల 15 వరకు జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో పవన్ కల్యాణ్ పాల్గొని ప్రసంగిస్తారు.

-------------------------

ఉమ్మడి విశాఖ జిల్లాలో స్థానిక సంస్థల కోటా శాసనమండలి –ఎమ్మెల్సీ స్థానం ఉపఎన్నికలో ఎన్డీయే కూటమి పోటీ చేయడం లేదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. తెలుగు దేశం పార్టీ నేతలతో ఈరోజు నిర్వహించిన దృశ్యమాధ్యమ సమావేశంలో ఈ మేరకు ఆయన స్పష్టం చేశారు. ఇలావుండగా ఉప ఎన్నిక నామినేషన్ల దాఖలుకు ఈ రోజు సాయంత్రం గడువు ముగియనుంది. ఇప్పటికే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున బొత్స సత్యనారాయణ నిన్న నామినేషన్ దాఖలు చేశారు. రేపు నామినేషన్లను పరిశీలించనున్నారు. ఉపసంహరణకు ఈ నెల 16వ తేదీన గడువుగా ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ నెల 30వ తేదీన ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉపఎన్నిక జరగనుంది.

-------------------------

సాధ్యమైనంత తర్వలో తుంగభద్ర జలాశయానికి స్టాప్‌లాగ్ గేటు ఏర్పాటు చేస్తామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. కర్ణాటక హోస్‌పేటలోని తుంగభద్ర జలాశయాన్ని మంత్రి పయ్యావుల కేశవ్‌తో కలిసి ఆయన ఈ ఉదయం పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, నిర్వహణ లోపం కారణంగానే ప్రాజెక్టులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. డ్యామ్ పటిష్టత, మరమ్మతులు, భవిష్యత్ కార్యాచరణపై నిపుణులతో చర్చిస్తామని మంత్రి పేర్కొంటూ,

..వాయిస్ (33 సెకన్లు)

-------------------------

చేనేత వస్త్రాలకి ప్రచారం కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా చేనేత ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. విజయవాడలోని మారిస్ స్టెల్లా కాలేజీ ఆడిటోరియంలో

ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆమె నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, చేనేత వస్త్రాల అమ్మకాల్లో దళారుల ప్రమేయం లేకుండా, నేత కార్మికులకు మేలు కలగజేయాలన్నదే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ వస్త్ర ప్రదర్శనకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తూ ఉండటంతో మరో వారం రోజుల పాటు పొడిగించనున్నట్లు తెలిపారు. చేనేత వస్త్రాల అమ్మకాలు మరింత పెరిగేలా రాష్ట్ర వ్యాప్తంగా చేనేత వస్త్ర ప్రదర్శనలు నిర్వహించినున్నట్లు మంత్రి తెలిపారు.

-------------------------

ఉపాధ్యాయుల పని సర్దుబాటుపై రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్‌ను పొడిగించింది. మిగులు ఉపాధ్యాయుల జాబితాలో తప్పులను సవరించేందుకు అవకాశం కల్పించింది. సీనియారిటీ జాబితా ముసాయిదాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ప్రధానోపాధ్యాయుడు, జిల్లా విద్యాశాఖాధికారు లకు తెలియచేయాలని సూచించింది. ఆన్‌లైన్‌లో తప్పులు ఉంటే సరి చేసుకునేందుకు ఈ నెల 15వరకు అవకాశం కల్పించింది. 16న మిగులు ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను ప్రచురించి, 17న మండల స్థాయిలో సర్దుబాటు చేయనున్నట్లు పేర్కొంది.

-------------------------

భారతదేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన తొలితరం సమరయోధుల్లో గాదె చిన్నపరెడ్డి వర్ధంతి ఈరోజు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం రెడ్డిపాలెం గ్రామంలో సుబ్బారెడ్డి, లింగమ్మ దంపతులకు గాదె చిన్నపరెడ్డి జన్మించారు. 1909 ఫిబ్రవరి 18న పెద్దప్రభను తనఎడ్లబండిపై అలంకరించుకొని ప్రసిద్ధ శైవపుణ్యక్షేత్రమైన కోటప్పకొండకు తన అనుచరులతో చిన్నపరెడ్డి ఊరేగింపుగా వెళ్లారు. అక్కడ పోలీసులు జరిపిన కాల్పుల్లో చిన్నపరెడ్డి ఎద్దును చంపటంతో.. చిన్నపరెడ్డి అతని అనుచరులు పోలీసులపై తిరగబడ్డారు.వారిని పోలీసులు అరెస్టుచేసి రాజమహేంద్రవరం జైలుకు తరలించారు. అనంతరం చిన్నపరెడ్డికి మద్రాస్ హైకోర్టు ఉరి శిక్ష విధించగా 1910 ఆగస్టు 13న ఉరితాడును ముద్దాడుతూ దేశ విముక్తి కోసం చిన్నపరెడ్డి ప్రాణత్యాగం చేశారు. ఇప్పటికీ ఆయన త్యాగాన్ని దేశభక్తిని ప్రజలు గుర్తు చేసుకుంటూ సై సైరా చిన్నపరెడ్డి- నీపేరే బంగారపుకడ్డి.. అంటూ పాటలు, బుర్రకథల రూపంలో వారి వీరగాధను గుంటూరు జిల్లాలో చెప్పుకుంటారు.

-------------------------

విదేశాల్లో ఉద్యోగాల పేరుతో యువతను మోసగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ హెచ్చరించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం వేదికగా తెలిపారు. మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముఠాలపై ప్రత్యేక దృష్టి సారించి, ఆయా నెట్‌వర్క్‌లను గుర్తించి నిర్మూలిస్తామని స్పష్టం చేశారు. ఏజెంట్ల మోసాలపై సమగ్ర దర్యాప్తు చేయిస్తామని తెలిపారు. "థాయ్‌లాండ్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని ఏజెంట్ నమ్మించి మోసం చేశారని రాష్ట్రానికి చెందిన ప్రవీణ్‌కుమార్ అనే యువకుడు సామాజిక మాధ్యమంలో పెట్టిన పోస్టుపై మంత్రి స్పందించారు. ఇలాంటి ఘటనలు దురదృష్టకరమని, బాధితుడిని రాష్ట్రానికి తీసుకొస్తామని తెలిపారు.

-------------------------

ఎన్టీఆర్ జిల్లాలో గోదావరి-కృష్ణా సంగమ ప్రాంతమైన ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద కృష్ణమ్మ హారతి కార్యక్రమాన్ని పున:ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర దేవాదాయశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. కృష్ణమ్మ హారతి పున:ప్రారంభానికి సంబంధించి నిన్న రాష్ట్ర సచివాలయంలో మంత్రి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ, పవిత్ర సంగమం

వద్ద కృష్ణమ్మ హారతిని మళ్లీ నెలరోజుల్లో పున:ప్రారంభించనున్నామని తెలిపారు. ఇందుకుగాను పవిత్ర సంగమం వద్ద రహదారులు, విద్యుత్తు బస్సు సౌకర్యం, ఇతర మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో పునరుద్ధరించేందుకు సంబంధిత శాఖల అధికారులు  చర్యలు తీసుకోవాలని  మంత్రి కోరారు.

---------------------------

కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీల అమలుకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్.. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారు. నిన్న ఢిల్లీలో కేంద్ర ఆర్థికమంత్రిని కలిసిన ఆయన రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల గురించి వివరించారు.

=======================